రసాయనం.. అతిగా వాడితే అనర్థం

- మందుల పిచికారీలో జాగ్రత్తలు అవసరం
- మోతాదుకు మించితే దిగుబడికే నష్టం


మొసలపల్లిలో పంటకు పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతులు (ఫైల్)

అంబాజీపేట: ఆధునిక టెక్నాలజీ పెరుగుతున్నా... వ్యవసాయం మాత్రం వ్యయ౯సాయంగా మారింది. రైతులు సరికొత్త పద్ధతుల్లో పంటల సాగు చేయడంతో రసాయన మందుల వినియోగం కూడా రోజురోజుకూ పెరిగిపోతోంది. విత్తనాలు చల్లడం నుంచి పంట కోతకు వచ్చే వరకూ పురుగుమందుల వాడకంపై రైతులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలి. లేని పక్షంలో పంట దిగుబడి దెబ్బతినడంతో పాటు రైతు నష్టాల బారిన పడాల్సి వస్తుంది. అధికంగా పురుగు మందులు వినియోగిస్తే ప్రమాదమని వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. మోతాదుకు మించి రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగిస్తే పంటపై ప్రభావం పడుతుందని, తప్పకుండా రైతులు వ్యవసాయ సిబ్బంది సలహాలు, సూచనలు పాటించాలని తెలియజేస్తున్నారు. 25 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్న సమయంలో వంటలకు పిచికారీ చేయాలి. రైతులు పలు జాగ్రత్తలు తీసుకుని పిచికారీ చేస్తే ప్రమాదాల నుంచి గట్టెక్కవచ్చని ఇటు వైద్యులు, అటు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మూడు నియోజకవర్గాలకు సంబంధించి పి.గన్నవరంలో 25,382, కొత్తపేటలో 34,702, రాజోలులో 8,650 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు.

రసాయనాలు పిచికారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

గాలికి ఎదురుగా రసాయన మందులు పిచికారీ చేయరాదు. తెగులు మందు, పురుగుమందు కలిపి పిచికారీ చేయరాదు. చేతలకు గ్లౌజులు, నోరు, ముక్కుకు మాస్కులు వేసుకోవాలి. మందులు పిచికారీ చేసే సమయంలో కళ్లు, ముక్కు, నోరు, చేతులతో రుద్దుకోరాదు. వాడిన పురుగు మందుల డబ్బాలు ఎక్కడపడితే అక్కడ వేయరాదు. రసాయన మందులు పిచికారీ సమయంలో స్ప్రేయర్లకు లీకేజీ ఉండరాదు. ద్రావణం కలిపే మందు డబ్బాపై సూచించిన మేరకు గానీ, వ్యవసాయ అధికారులు సూచించిన మేరకు గానీ పిచికారీ చేయాలి. పిచికారీ చేసే సమయంలో బీడీలు, సిగరెట్లు తాగరాదు. భోజనానికి ముందు చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. రసాయన మందు పిచికారీ చేసే సమయంలో కడుపుమంట, దద్దుర్లు వస్తే సమీపంలో ఉన్న వైద్యుడిని సంప్రదించాలి.

మోతాదుకు మించి వాడరాదు



వ్యవసాయ సిబ్బంది సూచించిన మేరకు తగిన మోతాదులో వంటకు ఉదయం వేళల్లో పిచికారీ చేయాలి. ముఖానికి మాస్కులు, చేతులకు గ్లౌజులు, కళ్లకు అద్దాలు ధరించి పిచికారీ చేయాలి. కలుపు మందు కొట్టిన తరువాత పురుగుమందు కొట్టరాదు. మొక్కల పై భాగంతో పాటు కిందభాగం తడిసిపోయేలా పిచికారీ చేస్తే ఆకు కింద ఉన్న రసం పీల్చే పురుగులు నశిస్తాయి.

– సీహెచ్‌డీ విజయ్‌కుమార్, ఏవో, అంబాజీపేట

జాగ్రత్తలు పాటించాలి



పంటలపై క్రిమి సంహారక మందులు పిచికారీ చేసే సమయంలో రైతులు తప్పని సరిగా జాగ్రత్తలు పాటించాలి. అస్వస్థతకు గురైన వెంటనే సమీపంలోని వైద్యుడిని సంప్రదించాలి. పురుగుమందు పిచికారీ చేసే సమయంలో కళ్లు, ముక్కు, నోటిలోకి రసాయన మందు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. చేతులను శుభ్రంగా కడుక్కుని భోజనం చేయాలి.

– కేఎస్ శ్రీనివాస్, పీహెచ్‌సీ వైద్యాధికారి, అంబాజీపేట

మట్టి అక్రమ తవ్వకాలను నిలిపివేయాలి


చొప్పెల్లలో మట్టి అక్రమ తవ్వకాల నిర్మూలనపై అభిప్రాయాలను తెలుసుకుంటున్న తహసీల్దార్

అలమూరు: నిబంధనలకు విరుద్ధంగా లంక ప్రాంతాల్లో జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలను సత్వరమే నిలిపివేయాలని తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని మూలస్థాన అగ్రహారం, చొప్పెల్ల గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఆయా గ్రామ సర్పంచ్‌లు లంక వరప్రసాదరావు, దంగేటి చంద్రకళ అధ్యక్షతన నిర్వహించిన సమావేశాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాత్రి వేళల్లో అనుమతి లేకుండా మట్టి, ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. అక్రమ మట్టి, ఇసుక తవ్వకాల నివారణకు ప్రత్యేక బృందాలు నియమించమన్నారు. అక్రమాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం అక్రమ మట్టి తవ్వకాల గురించి స్థానికుల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. మట్టి అక్రమాలపై ఫిర్యాదులు ఇచ్చిన వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, సూరపురెడ్డి సత్య, పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్, వీఆర్‌ఓ బి.ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరదలను ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉండాలి


మామిడికుదురు సమీక్షలో పాల్గొన్న తహసీల్దార్ మేరికమ్మ

మామిడికుదురు: గోదావరి వరదలను ఎదుర్కొనేందుకు అధికారులు సర్వం సన్నద్ధంగా ఉండాలని తహసీల్దార్ ఎం.మేరికమ్మ సూచించారు. మామిడికుదురు మండల రెవెన్యూ కార్యాలయంలో శనివారం గోదావరి వరదల నేపథ్యంలో తీసుకోవల్సిన ముందస్తు చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. బలహీనంగా ఉన్న ఏటిగట్లను పరిశీలించి అక్కడ ముందుగానే ఇసుక బస్తాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇసుక బస్తాలతో పాటు సర్వే బాదులను సిద్ధం చేయాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలకు అందించేందుకు తాగునీరు, వరద బాధితులకు పడవల ఏర్పాటు, పునరావాస చర్యలు, వరద ప్రభావిత గ్రామాల్లో ఏర్పాటు చేసే వైద్య ఆరోగ్య శిబిరాలు, ముంపు గ్రామాల ప్రజలను తరలించేందుకు బోట్లు ఏర్పాటు, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. నగరం ఎస్సై పి.సురేష్, ఎంపీడీఓ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, డీటీ శరణ్య, హెడ్ వర్క్స్, ఇరిగేషన్, వైద్య ఆరోగ్య శాఖ, విద్యుత్ శాఖ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వంతెన పనులను పరిశీలించిన ఎమ్మెల్యే


ఊడిమూడిలంక వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం: ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక గ్రామాల ప్రజల కోసం వశిష్ట నదీపాయపై నిర్మిస్తున్న వంతెనను సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. నిర్మాణంలో ఉన్న వంతెనను శనివారం ఆయన పరిశీలించారు. గత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఏఐఐబీ నిధులు రూ.49.5 కోట్లతో ఇక్కడ వంతెనను నిర్మిస్తున్న విషయం విదితమే. ఇప్పటి వరకూ జరిగిన పనులను పంచాయతీ రాజ్ డీఈఈ అన్యం రాంబాబు ఎమ్మెల్యే గిడ్డికి వివరించారు. రెండు అబెట్‌మెంట్ వాల్స్, తొమ్మిది పిల్లర్స్‌తో నదిపై వంతెన నిర్మిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకూ ఒక అబెట్‌మెంట్, మూడు పిల్లర్ల పనులను పూర్తి అయ్యాయని, మరో రెండు పిల్లర్ల వెల్ ఫౌండేషన్ పనులు జరుగుతున్నాయని వివరించారు. ఎమ్మెల్యే గిడ్డి మాట్లాడుతూ వంతెన నిర్మాణానికి పెండింగ్‌లో ఉన్న నిధుల విడుదలకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పనులను శరవేగంగా నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ పీపీ రాజును గిడ్డి దుశ్శాలువాతో సత్కరించారు. పీఆర్ ఈఈ కె.చంటిబాబు, ఏఈలు కొండలరావు, సత్యనారాయణ, సర్పంచ్‌లు దంగేటి అన్నవరం, నూకపెయ్యి ప్రసన్నకుమార్, ఎంపీటీసీలు ఆదిమూలం సూరయ్య కాపు, పల్లి మోషే, అయినపర్తి ప్రియదర్శిని, నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, తాటికాయల శ్రీను, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

రోజూ ఇంటింటికీ తాగునీరు

- ఎమ్మెల్యే దేవ వరప్రసాద్
- గుడిమెళ్లంక తాగునీటి పథకం పరిశీలన


గుడిమెళ్లంలో ర్యాపిడ్ ఫిల్టర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాజన్‌రాజు తదితరులు

మలికిపురం: వచ్చే పది నెలల కాలంలో రాజోలు నియోజక వర్గంలో ప్రతి గ్రామంలోనూ ప్రతి హేబిటేషన్ పరిధిలో ప్రతి ఇంటికీ రోజూ తాగునీటి సరఫరాయే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. శనివారం నియోజకవర్గంలోని ప్రధాన తాగునీటి సరఫరా పథకం అయిన గుడిమెళ్లంక ప్రాజెక్టును ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలసి పరిశీలించారు. ర్యాపిడ్ ఫిల్టర్‌ను, మైక్రో ఫిల్టర్‌లను, సంప్రదాయ ఫిల్టర్‌ను ఆయన వేర్వేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాను పర్యటించిన సమయంలో ప్రజల నుంచి అధికంగా ప్రతి రోజూ తాగునీటిని అందించాలని కోరినట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటి వరకూ రెండు రోజులకోసారి మాత్రమే తాగునీటిని అందిస్తున్నారని అన్నారు. సీఆర్‌ఎస్ నుంచి రూ.5 కోట్లు, ప్రభుత్వం నుంచి మరో రూ.5 కోట్లు సమకూర్చి లక్ష్యాన్ని నెరవేరుస్తానని ఆయన పేర్కొన్నారు. అలాగే తాగునీటి పథకాల పని తీరును అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. సంపులు, ట్యాంకులు ప్రతి నెలా క్రమం తప్పకుండా పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాజన్‌రాజు, ఏఈ సత్యనారాయణ రాజు, పార్టీ నాయకులు గుండుబోగుల పెదకాపు, రాజోలు వైస్ ఎంపీపీ ఇంటిపల్లి ఆనందరాజు, పినిశెట్టి బుజ్జి, మాజీ సర్పంచ్ చెల్లింగి సత్యనారాయణ, జగన్ తదితరులు పాల్గొన్నారు.

జంతువుల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి


గుడిమెళ్లంకలో వ్యాక్సిన్ వేయిస్తున్న ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి


కొత్తపేటలో కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న ఏడీ వెంకటనారాయణ

కొత్తపేట: ఇంట్లో, పెరట్లో జంతువు ముఖ్యంగా కుక్కల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ), స్థానిక ఏరియా పశువైద్యశాల వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ వెంకటనారాయణ యజమానులకు సూచించారు. ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా స్థానిక పశువైద్యశాల వద్ద ఏడీ వెంకటనారాయణ పెంపుడు జంతువులకు ముఖ్యంగా కుక్కలకు వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయా జంతువుల యజమానులకు జంతువుల పెంపకంలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. ముఖ్యంగా రేబిస్ వ్యాధిని కలగజేసే వైరస్ కుక్క లాలాజలంలో ఉంటుందని, కుక్కకాటు ద్వారా శరీరంపై ఏదైనా పుండు ఉంటే దానిపైన కుక్క చొంగ పడినా వ్యాధి సోకే ప్రమాదం ఉందన్నారు. ఈ వ్యాధి సోకితే చికిత్స లేదని, వ్యాధి రాకుండా నివారణ చర్యలు తీసుకోవడం ఒక్కటే ఉత్తమం అని అన్నారు. ఈ వ్యాధి లక్షణాలు 20 రోజుల నుంచి రెండేళ్లలో ఎప్పుడైనా బయట పడవచ్చన్నారు. కుక్క కాటు వేయగానే సబ్బు నీళ్లతో శుభ్రంగా కడిగి టింక్చర్ అయోడిన్ అద్దాలని, నిర్దేశిత డోసులు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించాలని, పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు ఏటా క్రమం తప్పకుండా వేయించాలన్నారు. వ్యాధి సోకిన పశువుల పాలు తీయకూడదని సూచించారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఏ పి.ఉమామహేశ్వరరావు, స్థానిక పశుసంవర్ధక సహాయకుడు బీర రమేష్ పాల్గొన్నారు.

మలికిపురం: మండలంలోని గుడిమెళ్లంక పశువైద్యశాల వద్ద శనివారం జునోసిస్ డే నిర్వహించారు. ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి పాల్గొని కుక్కలకు వ్యాక్సిన్ కార్యక్రమం ప్రారంభించారు. అలాగే మలికిపురం పశు వైద్యశాల వద్ద జరిగిన జునోసిస్ డేలో సుమారుగా 100 కుక్కలకు ఉచిత ర్యాబిస్ నివారణ టీకాలు వేశారు. స్థానిక సర్పంచ్ గెద్దం రాజ్యలక్ష్మి శిబిరం ప్రారంభించారు. మలికిపురం పశు వైద్యశాల డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు, గుడిమెళ్లంక పశువైద్యాధికారి శివకుమార్, అసిస్టెంట్ ఎం.రవికాంత్ పాల్గొన్నారు.

ఏక్ భారత్ సాధనకే శ్యామాప్రసాద్ ప్రాణత్యాగం


వానపల్లిలో శ్యామాప్రసాద్‌ముఖర్జీకి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నేత పాలూరి సత్యానందం

కొత్తపేట: ఏక్ భారత్ సాధనకు తన ప్రాణాలను త్యాగం చేసిన మహానేత భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ అని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం అన్నారు. మండలంలోని వానపల్లిలో శనివారం శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల బీజేపీ అధ్యక్షుడు పాలాటి మాధవస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ నేత పాలూరి సత్యానందం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముఖర్జీ చిత్రపటానికి సత్యానందం పూలమాల వేసి నివాళులర్పించారు. భారతదేశం గర్వించదగ్గ జాతీయ నాయకుల్లో శ్యామాప్రసాద్ ముఖర్జీ ఒకరని అన్నారు. ప్రముఖ న్యాయవాది, విద్యావేత్త అయిన శ్యామాప్రసాద్ నెహ్రూ మంత్రివర్గంలో మంత్రిగా పని చేస్తూ, లియాఖత్ ఒప్పందం విషయంలో నెహ్రూతో విభేదించి మంత్రి పదవికి రాజీనామా చేసి బయటకు వచ్చారన్నారు. తర్వాత రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సహాయంతో భారతీయ జనసంఘ్‌ను స్థాపించారన్నారు. నాటి జనసంఘ్ పార్టీయే నేటి బీజేపీ అని వివరిస్తూ వారు చూపిన జాతీయ వాదం, ఉద్యమ స్ఫూర్తితో అఖండ భారతావని నిర్మాణం కోసం అందరం పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ కోనసీమ ప్రముఖ్ తొగరు సీతారామాంజనేయులు, జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడు విళ్ల దొరబాబు, నియోజకవర్గ కో కన్వీనర్ కోటిపల్లి దామోదరం, జిల్లా కార్యదర్శి బాబి, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు గొలకోటి వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

రాజోలు: భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతిని శనివారం రాజోలులో నిర్వహించారు. బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ సెంటర్‌లో శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా మాట్లాడుతూ జాతీయ ఉద్యమాలు, కశ్మీర్ అంశంపై పోరాటాలు చేశారన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు పితాని శ్రీనివాసరావు, నియోజకవర్గ కో–కన్వీనర్ జొన్నలగడ్డ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జనం కోసమే జగ్జీవన్‌రామ్ జీవితం


మలికిపురంలో జగ్జీవన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తులసీ భాస్కరరావు తదితరులు


అంబాజీపేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ వరలక్ష్మి

ఘనంగా వర్ధంతి

మలికిపురం: జనం కోసమే బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం అంకితం చేశారని బహుజన సమన్వయ కమిటీ మలికిపురం, సఖినేటిపల్లి మండలాల అధ్యక్షులు గెద్దం తులసీ భాస్కరరావు పేర్కొన్నారు. మలికిపురం పూలే అంబేడ్కర్ భవనంలో శనివారం జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గెద్దం ఫిలిప్‌రాజు, తాడి సహదేవ్, ఈద మనోజ్, సోమిశెట్టి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: దేశ మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు నేటితరం యువత కృషి చేయాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా అంబాజీపేట బస్టాండ్ వద్ద, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉండుర్తి నాగబాబు ఆధ్యక్షతన శనివారం జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పలు గ్రామాల్లోనూ జగ్జీవన్ వర్ధంతిలో పలువురు పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: భారత ఉప ప్రధాని, స్వాతంత్య్ర సమరయోధుడు బాబూ జగ్జీవన్‌రామ్ ఆదర్శనీయుడని జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు శ్లాఘించారు. జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా మామిడికుదురు బస్టాండ్ కూడలిలోని విగ్రహానికి కూటమి నేతలు శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ చేసిన సేవలను కొనియాడారు. అడబాల తాతకాపు, యాలి శ్రీనివాస్, గౌస్ మొహిద్దీన్, సూదా బాబ్జి, జాలెం శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజోలులో..

రాజోలు: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ చిరస్మరణీయుడని దళిత చైతన్య వేదిక నాయకులు అన్నారు. శనివారం రాజోలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు వద్ద జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత చైతన్య వేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: అణగారిన వర్గాల సంక్షేమం కోసం కృషి చేసిన మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ అందరికీ ఆదర్శనీయమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. జగజ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా స్థానిక అక్విడెక్టు పార్కులో శనివారం ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే గిడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, నాయకులు డొక్కా నాథ్ బాబు, తోలేటి సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాలబాలాజీని దర్శించుకున్న ఆర్డీఓలు


ఆర్డీఓలకు స్వామి వారి చిత్రపటాలు అందజేస్తున్న ఈఓ మాధవి

మామిడికుదురు: కొత్తపేట, రామచంద్రపురం ఆర్డీఓలు జీవీవీ సత్యనారాయణ, ఎస్.సుధాసాగర్‌లు అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని శనివారం దర్శించుకున్నారు. ఆర్డీఓలకు అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువు తీరిన బాలబాలాజీ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం పండితుల నుంచి వేద ఆశీర్వచనం అందుకున్నారు. ఆలయ ఈఓ గ్రంధి మాధవి ఆర్డీఓలకు స్వామి వార్ల శేష వస్త్రాలు అందించారు. వీటితో పాటు స్వామి వారి చిత్రపటాలు, ప్రసాదాలను అందజేశారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ


మామిడికుదురులో మొక్క నాటుతున్న ఎంఈఓ లక్ష్మీనారాయణ

మామిడికుదురు: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మండల విద్యాశాఖాధికారి ఎస్‌వీవీఎస్ లక్ష్మీనారాయణ సూచించారు. వన మహోత్సవాన్ని పురస్కరించుకుని మామిడికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శనివారం మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కేవలం మొక్కలతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ బృహత్తర కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. అందరి లక్ష్యం ఒకటే కావాలని, అదే పర్యావరణ పరిరక్షణ అని చెప్పారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని సీహెచ్ నిరంజని, ఉపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాధులకు మూలం కలుషిత తాగునీరు


ఇసుకపూడిలో డయేరియాపై అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌ఓ అప్పారావు

అంబాజీపేట: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున కాచి చల్లార్చిన నీటినే తాగాలని, కలుషిత తాగునీరు కారణంగానే అనేక రకాలైన వ్యాధులు వ్యాప్తి చెందుతాయని సీహెచ్‌ఓ బి.అప్పారావు అన్నారు. ఇసుకపూడిలో స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ఈ వ్యాధిపై శనివారం అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓ అప్పారావు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఓఆర్ఎస్, జింక్ టాబ్లెట్ల ఆవశ్యకత గురించి వివరించారు. చిన్న పిల్లలకు సార్వత్రిక వ్యాధినిరోధక టీకాలులో భాగంగా రోటా వైరస్, మీస్‌లెస్, వీటా సిరప్‌లను తగిన వయస్సులో వేయించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వి.మురళీకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ సుమంత్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

తెలుగువారికి గర్వకారణం మంగళంపల్లి


శంకరగుప్తంలో బాలమురళీకృష్ణ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: తెలుగువారికి గర్వకారణం మంగళంపల్లి బాలమురళీకృష్ణ అని రాజోలు ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం మంగళంపల్లి జయంతిని ఆయన స్వగ్రామం శంకరగుప్తంలో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ చిన్న నాటి నుంచే సంగీతం పట్ల అభిరుచిని పెంచుకుని ప్రఖ్యాత కర్నాటక సంగీత విద్వాంసుడిగా పేరుగాంచి పద్మవిభూషణ్ అందుకోవడం ఆయన అసమాన ప్రతిభకు నిదర్శనమన్నారు. ఆయన స్వస్థలం కూడా రాజోలు దీవిలోని శంకరగుప్తం కావడం మనందరికీ మరింత ఆనందకరమని అన్నారు. సమన్వయ కర్త గుండుబోగుల పెదకాపు, సర్పంచ్ రాపాక ఆనంద్‌కుమార్, ఎంపీటీసీలు అచంట మాణిక్యం, ఎం.ప్రమీల, ఉపసర్పంచ్ శిరిగినీడి నాని, కొమరగిరి శ్రీనివాస్, పి.మల్లు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని దర్శనానికి పోటెత్తిన భక్తులు


నల్లచెరువులో స్వామి దర్శనానికి క్యూలో నిల్చొన్న భక్తులు

అలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన వేంకటేశ్వరుని ఆలయాల్లో అంతటా గోవింద నామస్మరణతో మార్మోగిపోయాయి. ఆయా గ్రామాల్లోని ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్శిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తిపారవశ్యం చెందారు. ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు వేద మంత్రోచ్చారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆయా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను పూల, తులసిమాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

నల్లచెరువులో..

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసి పూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామికి పటిక బెల్లం మొక్కుగా చెల్లించారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

సంపూర్ణ పారిశుధ్యంతోనే డెంగీ నివారణ

అలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పి డెంగీ వంటి వ్యాధులను పూర్తిగా నిర్మూలించాలని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, ఆర్.మల్లికార్జున, డి.సాయికిషోర్ కోరారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా పీహెచ్‌సీలతో పాటు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల్లో శనివారం భారీ ర్యాలీలు నిర్వహించారు. ఈనెల ఒకటి నుంచి 31 వరకూ నిర్వహించే డెంగీ వ్యాధి వ్యతిరేక మాసోత్సవాల ఆవశ్యకతను ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్ బాలమణి, ఎంఎల్‌హెచ్‌ఓ వి.సువర్చల తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

అన్నదాన పథకానికి విరాళం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామి ఆలయ ఆవరణలో నిర్వహించే అన్నదాన పథకానికి రూ.12,500 విరాళం అందినట్లు ఆలయ ఈఓ బి.కృష్ణ చైతన్య తెలిపారు. మంగళగిరికి చెందిన జె.మాధవకిరణ్ విరాళం అందించినట్లు తెలిపారు. దాతలకు ఆయన చేతుల మీదుగా స్వామి వారి చిత్రపటం అందజేశారు.

పుంతరోడ్డును అభివృద్ధి చేయాలి


అయినవిల్లిలంకలో బురదతో గుంతలు పడిన పుంతరోడ్డు

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లిలంకలో ఉన్న పుంతరోడ్డును అభివృద్ధి చేయాలని పలువురు రైతులు అధికారులను కోరుతున్నారు. ఈ రోడ్డు వ్యవసాయ ఉత్పత్తులు తరలించుకోవడానికి అనువుగా ఉంటుందన్నారు. అయితే వర్షాకాలంలో ఈ రహదారి బురదగా మారడంతో పాటు పెద్ద గుంతలు పడుతోందన్నారు. దీంతో వాహనాలు ఈ రోడ్డులో వెళ్లడం కష్టంగా ఉందన్నారు. రైతులు వ్యవసాయ ఉత్పత్తులు తరలించుకోవడానికి వీలుగా ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని అధికారులను కోరుతున్నారు.

గుంతల పూడ్చివేత ప్రారంభం

పి.గన్నవరం: అధ్వానంగా మారిన స్థానిక ఏజీ రోడ్డుపై గుంతల పూడ్చివేత పనులను శనివారం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రారంభించారు. పి.గన్నవరం నుంచి ముంగండ వరకూ గుంతలను పూడ్చి వేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.